క్లుప్తంగా

జోనల్ కమిషనర్‌కు సత్కారం


జోనల్ కమిషనర్ శేషాద్రిని సత్కరిస్తున్న బొడ్డ గోవింద్

అగనంపూడి: గాజువాక జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శేషాద్రిరావును గాజువాక మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డ గోవింద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. గాజువాకలోని జోనల్ కార్యాలయంలో జెడ్సీని కలిసి 87వ వార్డులోని సమస్యలను వివరించారు. సత్వరం సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆడారి శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ


లక్ష తులసి పూజ చేస్తున్న వేద పండితులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఉదయం సుప్రభాత సేవ, అర్చన, సాయంత్రం నిత్య హోమం, లక్ష తులసి పూజ అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. తర్వాత అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సినీ జగత్తు ధృవతార లతామంగేష్కర్


లతా మంగేష్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: సినీ జగత్తులో ధృవ తారగా నిలిచిన భారతరత్న లతా మంగేష్కర్ సేవలు ఎనలేనివని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. సినీగాయని లతా మంగేష్కర్ జయంతి సందర్భంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరవై భాషల్లో 50వేలకు పైగా పాటలు పాడిన లతా మంగేష్కర్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం భారత రత్న బిరుదు ప్రదానం చేసిందన్నారు. నృత్యం, గానం, సంగీతం విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదలు, వృద్ధులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డెడికేషన్ పార్క్‌లో శనివారం పేదలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. స్టీల్‌ప్లాంట్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం డీజీఎం పరమట సత్యనారాయణ ఈనెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా పరమట సత్యఝాన్సీ ట్రస్ట్ ఆధ్వర్యంలో 40 మంది మహిళలకు చీరలు, 40 మంది పురుషులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సత్యఝాన్సీ, ట్రస్ట్ కార్యదర్శి కుంచే సత్యనారాయణ, మాటూరి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



భక్తుల మనోభావాలతో ఆటలొద్దు


ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అమర్‌నాథ్ తదితరులు


మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి, చింతలపూడి

- కల్తీ నెయ్యి ఎక్కడ వాడారో చంద్రబాబు చెప్పాలి
- అధికారం చేపట్టి నాలుగు నెలలైనా నెరవేర్చని హామీలు
- రాజకీయ అవసరాల కోసం వేంకటేశ్వరస్వామిని లాగారు
- బాబుది డైవర్షన్ పాలిటిక్స్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్
- ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నేతల పూజలు

గాజువాక: తిరుమల పవిత్రతను, ప్రసాదాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తన రాజకీయ అవసరాల కోసం అపవిత్రం చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. తిరుమల పవిత్రను కాపాడాలని ఆకాంక్షిస్తూ ఆయన ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బీహెచ్‌పీవీ వద్ద ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ చంద్రబాబు తన డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా వేంకటేశ్వరస్వామి ప్రతిష్టను దిగజార్చి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్వామి భక్తుల మనోభావాలను దెబ్బ తీశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనప్పటికీ ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. విజయవాడలో వరదలు, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో వైఫల్యం తదితర అంశాలను మళ్లించడానికి బాబు ఈ కుట్రకు తెరలేపారని ధ్వజమెత్తారు.

ప్రభుత్వానికి బాధ్యత లేదా?

కల్తీ నెయ్యి ఎక్కడ వాడారన్న విషయం చెప్పాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందన్నారు. కల్తీ నెయ్యి వాడలేదని తెలిసీ ఇలాంటి రాజకీయాలు చేస్తున్న చంద్రబాబును దేవుడు క్షమించడన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక చంద్రబాబు ఇలాంటి జిమ్మిక్కులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

బాబుకు భక్తి లేదు

చంద్ర బాబుకు తల్లిదండ్రులంటే భయం లేదని, దేవుడు అంటే భక్తి లేదని అమర్ ఎద్దేవా చేశారు. ప్రజల మనోభావాలతో ఆడుకొనే ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై చంద్రబాబు ప్రభుత్వం వేసిన కమిటీపై ఎవరికీ నమ్మకం లేదన్నారు. గతంలో తాము కూడా అధికారంలో ఉన్నామని, ఇలాంటి కమిటీలు ఎవరి కింద పని చేస్తాయో తమకు తెలుసునని పేర్కొన్నారు. సిట్‌ను చంద్రబాబు తన సీటు కింద పెట్టుకుంటారన్నారు.

నోటీసులతో అడ్డగింత

తిరుమల వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవడానికి వెళ్తే నోటీసులు ఇస్తున్నారని ఆక్షేపించారు. గతంలో ఎప్పుడైనా ఇలాంటి సంస్కృతి ఉందా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో జగన్ మోహన్‌రెడ్డి అనేక సార్లు స్వామివారిని దర్శించుకొన్నారని, అప్పుడు డిక్లరేషన్ ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. జగన్ మోహన్‌రెడ్డి తన కులం, మతం ఏమిటన్నది నిన్ననే చెప్పారని తెలిపారు. కొద్ది రోజుల్లో స్వామివారిని దర్శించుకోవడానికి జగన్ మోహన్‌రెడ్డి వెళ్తారని, అప్పుడు ఎవరు ఆపుతారో చూస్తామని అన్నారు. చంద్రబాబుకు సరైన బుద్ధి ప్రసాదించాలని దేవుడిని వేడుకున్నామన్నారు.

పవన్‌కు అర్థం లేదు

కాగా, పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్ష అర్థం లేనిదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పవన్ ప్రాయశ్చిత దీక్ష చేపడితే బాగుంటుందని అమర్‌నాథ్ హితవు పలికారు. అన్ని పాపాలు కూటమి ప్రభుత్వం చేసిందన్నారు. హిందువుల మనోభావాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుందన్నారు. లేనిది ఉన్నట్టుగా, ఉన్నది లేనట్టుగా సృష్టించడం చంద్రబాబుకు అలవాటని మండిపడ్డారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి చందు, పి.వి.సురేష్, నాయకులు బొక్కాకుల వెంకటరావు, ఉరుకూటి అప్పారావు, పల్లా చినతల్లి, గుడివాడ లతీష్, కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ధర్మాల శ్రీను, మహ్మద్ గౌస్, మొల్లి చిన్న, డి.వి.రమణారెడ్డి, పూర్ణానంద శర్మ, బోగాది సన్ని, మంత్రి శంకరనారాయణ, సంద్రాన నూకరాజు, జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా పురస్కారాలు ప్రదానం


కోక్ ఓవెన్స్ విభాగం అధికారులకు అవార్డు ప్రదానం చేస్తున్న సీజీఎం శ్రీధర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శనివారం వివిధ విభాగాలకు స్వచ్ఛతా పురస్కారాలు అందజేశారు. 2023 సెప్టెంబర్ 16 నుంచి 2024 సెప్టెంబర్ 24 వరకు స్వచ్ఛ భారత్ నిర్వహణలో ప్రతిభ చూపిన విభాగాలను స్వచ్ఛతా పురస్కారాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఈడీ (వర్క్స్) కాన్ఫరెన్స్ హాలులో శనివారం జరిగిన కార్యక్రమంలో బ్లాస్ట్‌ఫర్నేస్, కోక్‌ఓవెన్స్, ఎల్ఎంఎం, ఎస్ఎంఎస్-2, సింటర్ ప్లాంట్, వైర్ రాడ్ మిల్-2, ఈటీఎల్, ఇంజినీరింగ్ షాప్స్, ఎఫ్ఎండీ, ఇనుస్ట్రుమెంటేషన్, ఎస్.ఎస్.డి, ట్రాఫిక్, మెడికల్, టౌన్ అడ్మిన్ విభాగాలకు పురస్కారాలు ప్రదానం చేశారు. సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు


వైకుంఠ వెంకన్న

పెదగంట్యాడ: ఏకాదశి సందర్భంగా వాంబే కాలనీ కొండపై కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నెల్లిముక్కు రామాలయంలో.. జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు రామాలయంలో ఏకాదశి పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు.

గాజువాక ఉచ్ఛిష్ట గణపతికి ప్రపంచ రికార్డు


89 అడుగుల ఉచ్ఛిష్ట మహాగణపతి,లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి అందిన సర్టిఫికెట్

గాజువాక : ఎస్వీ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాజువాకలో ఏర్పాటు చేసిన 89 అడుగుల ఉచ్ఛిష్ట మహాగణపతికి ప్రపంచ రికార్డు లభించింది. ఈ మేరకు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి ఉత్సవ నిర్వాహకుడు కొసిరెడ్డి గణేష్‌ను అభినందిస్తూ దీనికి సంబంధించిన సర్టిఫికెట్ శనివారం అందింది. గాజువాక ఆధ్యాత్మిక కీర్తిని ప్రపంచ నలుమూలలా చాటడం కోసం తాను ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నానని, తాము ఏర్పాటు చేసిన ఉచ్ఛిష్ట మహాగణపతికి ఇలాంటి గొప్ప గుర్తింపు, గౌరవం లభించడం ఆనందంగా ఉందని గణేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నేడు అనుపోత్సవం..

ఎస్వీ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహిస్తున్న 89 అడుగుల ఉచ్ఛిష్ట మహాగణపతి విగ్రహ నిజమజ్జనోత్సవం ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నారు. వినాయక ఉత్సవం ముగింపు సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ నిర్వాహకుడు కొసిరెడ్డి గణేష్ తెలిపారు. ప్రతిష్ఠించిన చోటే విగ్రహాన్ని నిమజ్జనం చేయనున్నట్టు పేర్కొన్నారు. స్వామివారికి ప్రసాదంగా సమర్పించిన 89 కేజీల లడ్డూ వేలం వేయనున్నట్టు తెలిపారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దు


మాట్లాడుతున్న సీఐ కిల్లి వెంకటరావు

అగనంపూడి: ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, మద్యం సేవించి వాహనాన్ని నడిపితే కఠిన చర్యలు తప్పవని సౌత్ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు హెచ్చరించారు. కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ వెళ్లే మార్గంలో ఆటో డ్రైవర్లకు శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగంతో ప్రయాణించడం, నిబంధనలు అతిక్రమించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానాలతో పాటు కేసులు తప్పవన్నారు. యూనిఫాం ధరించాలని, ముందు సీట్లో ప్రయాణికులను కూర్చోబెట్టడం నేరమని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వరలక్ష్మి, సిబ్బంది సన్ని యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల నియామకంలో తాత్సారమేల?

అగనంపూడి: నిర్వాసితుల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన విశాఖ ఉక్కు నిర్వాసిత హార్టికల్చర్ సొసైటీల్లో కొన్నింటికి పదవీ కాలం ముగిసినా వారి స్థానంలో ఎందుకు ప్రత్యేకాధికారులను నియమించలేదని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు ఉక్కు యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖస్టీల్‌ప్లాంట్‌లోని గుత్తేదారుల వద్ద పనిచేసే కార్మికులకు కూడా సొసైటీలో ఉపాధి కల్పించడం, సొసైటీ పాలకవర్గం ఇష్టానుసారం ఖర్చులు చేయడంపై ఉక్కు నిఘా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆయన నిలదీశారు. సొసైటీలో ఆధార్‌కార్డులో పుట్టిన తేదీని ఆధారంగా చేసుకొని పదవీ కాలం ముగిసిందని కార్మికులను తొలగిస్తున్న యాజమాన్యం, సొసైటీల పాలకవర్గం పదవీ కాలం ముగిసినా కూడా వారే అధికారం చెలాయించడం సరికాదని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో దేవర అప్పలకొండ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి


భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి అతి చిన్నవయసులోనే ప్రాణ త్యాగం చేసిన భగత్‌సింగ్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి రమణారెడ్డి అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెంటయ్య, సాంబశివరావు, అప్పారావు,అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

108 మంది పోలీసులకు రివార్డులు


కానిస్టేబుల్‌కు రివార్డు అందజేస్తున్న సీపీ బాగ్చి

మద్దిలపాలెం: నగర పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన 108 మంది అధికారులు, సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. వృత్తిలో అంకితభావంతో పని చేసిన హోంగార్డు స్థాయి నుంచి సీఐ స్థాయి అధికారులకు రివార్డులను అందజేశారు. తమ ప్రతిభను గుర్తించి, ఉన్నతాధికారుల సమక్షంలో పోలీసు కమిషనర్ రివార్డులు అందజేయడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

క్రీడా పోటీలు రేపు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెందుర్తి నియోజకవర్గ స్థాయి క్రీడా, ఆటల పోటీలు సోమవారం పెందుర్తి మండలం జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ పి.లక్ష్మి తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 28న లంకెలపాలెం హైస్కూల్‌లో పోటీలు నిర్వహించాల్సి ఉండగా వర్షాలకు మైదానం చిత్తడిగా మారడంతో తేదీతోపాటు వేదిక కూడా మార్చాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలకు నియోజకవర్గ జట్లను ఎంపిక చేయనున్నట్టు ఆమె తెలిపారు. పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు మార్పును గమనించాలని ఆమె కోరారు.

సెంటు భూమి లబ్ధిదారుల రీవెరిఫికేషన్


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గాజువాక: గత ప్రభుత్వం జారీ చేసిన సెంటు భూమి లబ్ధిదారుల అర్హతలపై రీ వెరిఫికేషన్ చేయాలని గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి సూచించారు. మన ఇల్లు – మన గౌరవం కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో గాజువాకలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం 19 వేల మందికి సెంటు భూమి చొప్పున పట్టాలు జారీ చేసిందన్నారు. లబ్ధిదారులకు స్థలాలు పూర్తిస్థాయిలో అప్పగించే ముందు మరోసారి అర్హతలను పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో సిబ్బంది కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. లబ్ధిదారుల్లో అనర్హులుంటే తొలగించాలని, నిజమైన అర్హులకు న్యాయం జరగాలన్నారు. సర్వే పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ, డిప్యూటీ ఇంజినీర్ రామకృష్ణ, ఏఈ గోపి, జోనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంఆర్ఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులకు కేంద్రం తూట్లు

విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు అయోధ్యరామ్


దీక్షల్లో మాట్లాడుతున్న అయోధ్యరామ్

అగనంపూడి: ఉక్కు కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాల తీరు మారకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు అయోధ్యరామ్ హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో శనివారం చేపట్టిన 1325వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. ఓపక్క కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును రక్షిస్తామని నమ్మబలికిస్తూనే మరోపక్క మానవ వనరులను పూర్తిగా తగ్గించే చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. స్వచ్ఛంద పదవీ విరమణ పథకం అమలు చేయడం, అనేక మందిని వివిధ ప్లాంట్‌లకు డిప్యుటేషన్‌పై పంపించడం, కాంట్రాక్ట్ కార్మికులను రాత్రికి రాత్రే తొలగించడం చూస్తుంటే ఉద్యోగులు, కార్మికులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తుందన్నారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ సెయిల్‌లో 54వేల మంది కార్మికులు ఉండగా 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేస్తున్నారని, అంటే ఒక మిలియన్ టన్నుకు 2750 మంది కార్మికులు పనిచేస్తున్నారని, అదే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 12 వేల మంది 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. స్టీల్ సీఐటీయూ ప్రతినిధులు దీక్షా శిబిరంలో పాల్గొనగా నాయకులు ఎస్.రామారావు, పుల్లారావు, మరిడయ్య, వి.ప్రసాద్, పట్టా రమేష్, మొహిద్దీన్, బాలశౌరి, శ్రీనివాస్, రాజు తదితరులు మాట్లాడారు.

పాత పద్ధతిలో గేటు పాసులు జారీ చేయాలి


స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికులకు పాత పద్ధతిలో గేటు పాసులు జారీ చేయాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం గాంధీతో శనివారం జరిగిన సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు సమస్యలను ప్రస్తావించారు. నూతన గేటు పాసుల మంజూరు ప్రతిపాదనను వ్యతిరేకించారు. పాత పద్ధతిలో అటెండెన్స్ కొనసాగించాలని డిమాండ్‌చేశారు. అంతకు ముందు సీజీఎం మాట్లాడుతూ తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను కొనసాగిస్తామన్నారు. ఆన్‌లైన్ చేసే వరకు వారికి పాత పద్ధతిలో అటెండెన్స్ ఇస్తామన్నారు. సమావేశంలో హెచ్‌ఆర్ అధికారులతో పాటు అఖిలపక్ష నాయకులు పి.వి. నగేష్, కె. వంశీకృష్ణ, జి. శ్రీనివాసరావు, నమ్మి రమణ, మంత్రి రవి, ఎస్. తాతారావు, పిట్టారెడ్డి, వి. అప్పారావు, టి. గుర్నాథ్, డి. రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8 మంది పేకాట రాయళ్ల అరెస్ట్

లక్షా నాలుగువేలు నగదు స్వాధీనం

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి రాజీవ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తులో పేకాడుతున్న 8 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, దువ్వాడ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ తన సిబ్బందితో పాటు దువ్వాడ ఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు, సిబ్బంది కలిసి పేకాట స్థావరంపై శనివారం సాయంత్రం దాడి చేశారు. టెర్రాస్‌పై పేకాడుతున్న 8 మంది పారిపోయే ప్రయత్నం చేయగా వారిని నిలువరించి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి లక్షా 4వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వక కలయిక


సబ్‌రిజిస్ట్రార్ అప్పారావును సత్కరిస్తున్న నాయకులు

అగనంపూడి: లంకెలపాలెం జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన మైచర్ల అప్పారావును శనివారం అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సందులో ఉండడం వల్ల వాహనాలు కూడా రావడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ప్రభుత్వ ఖాళీ స్థలంలో కార్యాలయం నిర్మించే ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే 22ఏ లో ఉన్న భూముల జాబితాను ఆవరణలో ఏర్పాటు చేయాలని నాయకులు సత్యనారాయణ, చందు, అప్పారావు, శ్రీను, రత్నం, పద్మ సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందించారు.

భర్త చెంతకు తప్పిపోయిన భార్య

అగనంపూడి: సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా తప్పిపోయిన భార్యను 24 గంటల్లో భర్తకు చెంతకు చేర్చి శభాష్ అనిపించుకున్నారు దువ్వాడ పోలీసులు.. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు..జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన తేకేటి వెంకటేశ్వరరావుకొడుకు కిషోర్, కోడలు వేలస్సీతో కలిసి నివాసముంటున్నారు. శుక్రవారం నుంచి కోడలి ఆచూకీ కనపడడం లేదని మామ వెంకటేశ్వరరావు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుగా నమోదు చేసిన పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఆమె సెల్‌ఫోన్ సిగ్నల్ టవర్ ఆధారంగా విజయవాడలో ఉన్నట్టు గుర్తించారు. ఆమెను స్టేషన్‌కు రప్పించి శనివారం భర్త కిషోర్ అప్పగించారు.



